
సాక్షి ఒడిశా

సోమవారం ; 24 ; జూలై ; 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం లెక్కించారు. ఇందులో నగదు రూ. 7,24,195లు, బంగారం 1.95 గ్రాములు, వెండి 7.8 గ్రాములు వచ్చినట్లు అధికారులు తెలిపారు.



ఉత్సాహంగా వన మహోత్సవాలు - 8లో



కొరియాలో అరవింద పాఢి పర్యటన - 8లో

న్యూస్‌రీల్

కలప దుంగలు స్వాధీనం



కలపతో పోలీసులకు చిక్కిన నిందితుడు

రాయగడ: పికప్ వ్యాన్‌లో అక్రమంగా కలప రవాణా చేస్తున్న వ్యక్తిని రామనగుడ పోలీసులు అరెస్ట్ చేసి, 14దుంగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు లమల శ్యామసుందర్(24)గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని రామనగుడ సమితి గొసాయిగులు ముండ పంచాయతీ పరిధి బంగి సమీపంలో అటవీశాఖ అధికారులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా రామనగుడ సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి పికప్ వ్యాన్‌లో కలప అక్రమంగా రవాణా అవుతున్న సమాచారం తెలుసుకున్న బంగి వద్ద దాడులు చేపట్టారు. ఈ మేరకు విలువైన కలపతో పాటు వ్యాన్ సీజ్ చేసి, నిందితుడిని అరెస్ట్ చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు


జయపురం: స్థానిక సబ్ డివిజన్ పరిధి కుంద్రా సమితిలోని దిగాపూర్ పంచాయతీలో రెండు కుటుంబాలు నివాసం ఉంటున్న 10 గదుల ఇల్లు అగ్నికి ఆహుతయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు అనుమానిస్తున్నారు. ఈ ప్రమాదం వల్ల ఈశ్వర కమర, గుప్తేశ్వర పాణిగ్రాహి సర్వం కోల్పోయారు. ఇళ్లలో ఉంచిన బియ్యం, ఆహారధాన్యాలు, బట్టలు, నగదు కాలి బూడిదైనట్లు బాధితులు పోయారు. ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో అకస్మాతుగా అగ్నిప్రమాదం సంభవించడంతో గ్రామస్తులు బొయిపరిగుడ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అయితే సిబ్బంది చేరుకునే సరికి ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న కుంద్రా తహసీల్దార్ ఆయూబ్ మండల్ ఆదేశాల మేరకు దిగాపూర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, నష్టాన్ని అంచనా వేశారు.

ప్రశ్నపత్రం లీక్

- ఓఎస్ఎస్సీ(సివిల్) మెయిన్ పరీక్షలు రద్దు


భువనేశ్వర్: బాలాసోర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సాగరిక నాథ్ సమర్పించిన నివేదిక ఆధారంగా ఒడిశా స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఓఎస్ఎస్సీ(సివిల్) మెయిన్ రాత పరీక్షను రద్దు చేసినట్లు ప్రకటించింది. ఆదివారం ఓఎస్ఎస్సీ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పరీక్ష ఈనెల 16న జరిగింది. వివిధ రాష్ట్ర కార్యాలయాల్లో గ్రూప్-బీ ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం ఈ పరీక్ష నిర్వహించారు. ప్రశ్న పత్రం లీక్ ఆరోపణ కింద బాలాసోర్ జిల్లా సహదేవ్ ఖుంటా పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు ఆధారంగా నిర్వహించిన విచారణ పురస్కరించుకుని కంబైన్డ్ టెక్నికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ ఎగ్జామినేషన్-2022 సంబంధించిన వివరణాత్మక ప్రకటన క్లాజ్ 11 ప్రకారం మెయిన్ రాత పరీక్ష రద్దు చేసినట్లు కమిషన్ పేర్కొంది. ఈ పరీక్షను సెప్టెంబర్ 3న నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

అలరించిన సంగీత విభావరి



రఘునాథ పాత్రో, బృందాన్ని సత్కరిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక పట్టణానికి చెందిన ప్రముఖ సంగీత దర్శకులు రఘునాథ పాత్రో, శిష్యబృందం భువనేశ్వర్ మ్యూజిక్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒడిశా సంగీత విభావరి అలరించింది. పర్లాకిమిడి రవీంద్ర మండపంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని సంస్థ అధ్యక్షుడు డాక్టర్ అరవింద బెహరా, డాక్టర్ సంజీవ్ హొత్తా, గురు లక్ష్మీకాంత పాత్రో, కార్యదర్శి క్షీరద్ పట్నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘునాథను గౌరవ పూర్వకంగా సన్మానించారు. క్రియేటివ్ ఆర్ట్స్ అధ్యక్షుడు నృసింహచరణ్ పట్నాయక్, గజపతి వికాస్‌మంచ్ కార్యదర్శి రాజకిషోర్ పాణిగ్రాహి, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా కుమారీ మంగరాజ్ ఆయనను అభినందించారు. కళాకారులు డాక్టర్ చందన్ గంతాయత్, అశుతోష్ మిశ్రా, ఆకాంక్ష పట్నాయక్ పాల్గొన్నారు. తబాలా సీతాకాంత జెన్నా, ఫ్లూట్ సౌమ్యరంజన్ జోషి సహకారం అందజేశారు.



డెంగీ.. డేంజర్ బెల్స్!

- రాష్ట్రంలో తొలి డెంగీ మృతి నమోదు
- చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయిన ఏడేళ్ల బాలిక
- భువనేశ్వర్ నగరంలోనూ విస్తరిస్తోన్న కేసులు
- ప్రభుత్వ నిర్లక్ష్యం, బాధ్యతా రాహిత్యంపై విమర్శలు

భువనేశ్వర్: రాష్ట్ర రాజధాని నగరంలో డెంగీతో 7 ఏళ్ల బాలిక మృతి చెందింది. రాష్ట్రంలో ఈ సీజన్‌లో ఇదే తొలి డెంగీ మృతి కావడం కలకలం రేపింది. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాలిక మృతి చెందినట్లు కుటుంబ వర్గాలు ఆదివారం తెలిపాయి. మృతురాలు స్థానిక జొగామొర ధర్మ విహార్‌కు చెందిన సాయిస్మిత సాహు(పిహు)గా గుర్తించారు. బాలికకు జ్వరం రావడంతో కొన్ని రోజుల క్రితం కుటుంబీకులు ఆస్పత్రిలో తనిఖీ చేయించారు. వైద్యుల తనిఖీలో డెంగీ పాజిటివ్‌గా తేలింది. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఉన్నత చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆమె ఫిట్స్‌తో బాధపడుతుందని ఉన్నత చికిత్స కోసం వెంటిలేటర్‌పై ఉంచినట్లు వైద్య వర్గాలు కుటుంబీకులకు తెలిపారు. అత్యవసర వార్డులో ఉన్నప్పుడు బాలిక అందరినీ గుర్తించగలిగింది. ఐసీయూలో చేర్చిన నుంచి ఆమె స్పందించడం మానేసిందని బంధువర్గాలు ఆవేదన వ్యక్తం చేశాయి. బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతూ చికిత్స సమయంలో కోమాలోకి వెళ్లినట్లు సమాచారం. అయితే ఆస్పత్రి అధికారుల నిర్లక్ష్యం వల్లే బాలిక చనిపోయిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

9 హాట్ స్పాట్‌లు..

భువనేశ్వర్‌లో డెంగీ హాట్‌స్పాట్‌ల సంఖ్య క్రమంగా పుంజుకుంటోంది. తాజాగా ఈ సంఖ్య 9కి పెరిగింది. ఆచార్య విహార్, భీమొ టంగి, చంద్రశేఖర్ పూర్, సీఆర్‌పీ, ఐఆర్‌సీ విలేజ్, జయదేవ్ విహార్, నయాపల్లి, పాఖొరిపుట్, సత్యనగర్ డెంగీ హాట్ స్పాట్ జాబితాలో ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ఒక్కో చోట 5కి పైగా పాజిటివ్ కేసులు నమోదు కావడంతో ఈ పరిస్థితి నెలకొంది.

ఆస్పత్రిలో అరకొర సౌకర్యాలు..

డెంగీ నివారణ కోసం నగరపాలక సంస్థ పలు కార్యక్రమాలు చేపడుతోంది. నగరవ్యాప్తంగా పారిశుద్ధ్య కార్యకలాపాలు నిరవధికంగా నిర్వహిస్తోంది. డెంగీ నివారణ పట్ల స్థానికులను చైతన్య పరచడంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్నత చికిత్స సౌకర్యాలు కల్పిస్తున్నట్లు బీఎంసీ చెబుతుండగా.. స్థానిక క్యాపిటల్ ఆస్పత్రి డెంగీ రోగులతో కిటకిటలాడుతోంది. రోగుల కోసం ప్రత్యేక వార్డు లేదా ప్రత్యేక పడకల సౌకర్యం లేకపోవడంతో ఇటువంటి పరిస్థితి వేధిస్తోంది. ఈ ఆస్పత్రిలో డెంగీ రోగుల కోసం నామమాత్రంగా 10 పడకలు మాత్రమే కేటాయించారు. బాధితుల తాకిడి పెరగడంతో ఇతర వార్డుల్లో రోగులతో సర్దుబాటు చేసి చికిత్స అందజేస్తున్నట్లు ఆరోపణ. నగరంలో 65 నుంచి 70 మంది వరకు డెంగీ యాక్టివ్ కేసులు కొనసాగుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. మరోవైపు ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తుండడంతో పారిశుద్ధ్య కార్యకలాపాలకు స్వస్తి పలకడంతో నివారణ చర్యలు కుంటుబడుతున్నట్లు పరిసరాలు అద్దం పడుతున్నాయి.

ఆస్పత్రి వర్గాలపై ఆరోపణలు..

భువనేశ్వర్ నగరపాలక సంస్థ 63వ నంబర్ వార్డు కార్పొరేటర్ సుజాత ఛోట్రాయ్ మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో డెంగీ అవగాహన కార్యక్రమం కొనసాగుతోంది. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి తాను స్వయంగా వార్డును సందర్శిస్తున్నట్లు తెలిపారు. డెంగీతో బాలిక మరణ వార్త విన్న తరువాత ఆశ్చర్యపోయినట్లు విచారం వ్యక్తం చేశారు. వ్యాధి నివారణ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ అభ్యర్థించారు. ఈ రోగానికి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్నత చికిత్స అందుబాటులో ఉంది. ప్రజలు మాత్రం ప్రైవేట్ ఆస్పత్రుల వైపే మొగ్గు చూపడం విచారకరమని వ్యాఖ్యానించారు. బాలిక డెంగీ తాకిడి విషయమై సంబంధీకులు నగరపాలక సంస్థ లేదా ప్రభుత్వ ఆస్పత్రి వైద్య వర్గాల్ని సంప్రదించక పోవడం దురదృష్టకరం. మరోవైపు ఖుర్దా ప్రాంతంలో డెంగీ విస్తరణ భయాందోళన కలిగిస్తోంది. ఇటీవల వర్షపాతం పెరుగుదల, పారిశుద్ధ్య చర్యల లోపం కారణాలతో వ్యాధి విస్తరిస్తోందని సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ సీజన్‌లో డెంగీ పాజిటివ్ కేసుల సంఖ్య 200 దాటాయి. ప్రధానంగా భువనేశ్వర్ నగరపాలక సంస్థ పరిధిలో డెంగీ తీవ్రత అత్యధికంగా తాండవించడం ఈ పరిస్థితిని అవగతం చేస్తోంది. జూన్‌లో భువనేశ్వర్, పరిసర ప్రాంతాల్లో(ఖుర్దా జిల్లా) 103 డెంగీ పాజిటివ్ కేసులు నమోదు కాగా, ఈనెల 16 నాటికి కొత్తగా మరో 77 కేసులు నమోదయ్యాయి.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఉన్నతాధికారులు



ఓపీసీసీ చీఫ్ శరత్ పట్నాయక్ ఆధ్వర్యంలో మాజీ ఉన్నతాధికారులు

- ఓపీసీసీ చీఫ్ శరత్ పట్నాయక్ సమక్షంలో చేరిక

భువనేశ్వర్: రాష్ట్ర కాంగ్రెస్ బలం కూడగట్టుకునే ప్రయత్నంలో తలమునకలై ఉంది. శరత్ పట్నాయక్ నేతృత్వంలో సత్తా చాటుకునేందుకు ప్రముఖులను పార్టీలో చేర్చుకునే ప్రయత్నాలు ఫలప్రదం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో నలుగురు రిటైర్డ్ ఉన్నతాధికారులు ఆదివారం కాంగ్రెస్ సభ్యత్వం పుచ్చుకున్నారు. వీరిలో మాజీ ఐఏఎస్ అధికారులు పంచానన్ దాస్, బిశ్వనాథ్ ఆచార్య, మాజీ ఓఏఎస్ అధికారులు రవీంద్రనాథ్ మిశ్రా, ఉద్ధబ్ ఖొరా ఉన్నారు. భువనేశ్వర్ లోని గాంధీభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కొత్త సభ్యులుగా చేరారు. ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(ఓపీసీసీ) అధ్యక్షుడు శరత్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్రశాఖ వ్యవహారాల ఇన్‌చార్జి డాక్టర్ ఎ.చెల్లాకుమార్, రాష్ట్రప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి బిజయ్‌కుమార్ పట్నాయక్ హాజరయ్యారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో బిజయ్‌కుమార్ పార్టీలో చేరారు. పంచానన్ దాస్ గతంలో ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలతో పాటు సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థల కార్యదర్శిగా బాధ్యతలు వహించి, విరమణ పొందారు. ప్రస్తుతం ఆయన ఫోరమ్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

నేతల సస్పెన్షన్‌పై..

కటక్ బరాబటి నియోజకవర్గ ఎమ్మెల్యే మహ్మద్ మొకీం, ఓపీసీసీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ చిరంజీబ్ బిస్వాల్ సస్పెన్షన్‌పై రాష్ట్ర రాజకీయాల్లో చర్చ వేడెక్కింది. పార్టీ చర్యతో వేటుకు గురైన ఈ ఇరువురు నేతల వ్యతిరేక పోరాటం రాష్ట్ర కాంగ్రెస్‌లో తుఫాను రగుల్చుతోంది. ఈ చర్యల పట్ల చాలామంది పార్టీ కార్యకర్తలు హైకమాండ్ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సస్పెండ్ చేయబడిన ఇద్దరు నాయకుల మద్దతుదారుల ఆందోళన కారణంగా వచ్చే ఏడాది లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం పార్టీ వ్యూహంపై చర్చించేందుకు రాష్ట్ర కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో కాకుండా ఓ హోటల్‌లో ఇటీవల నిర్వహించారు. అయితే నేతల వేటు విషయంపై సమావేశంలో చర్చించలేదని, పార్టీలో ఎలాంటి విభేదాలు లేవని ఓపీసీసీ అధ్యక్షుడు పేర్కొన్నారు. మొకీం, బిస్వాల్ సస్పెన్షన్ వ్యక్తిగత విషయాలని, ఈ అంశం ఇతర వేదికలపై చర్చించుకోవాల్సిందిగా తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశం 2024 సార్వత్రిక ఎన్నికలపై దృష్టి సారించింది. ఈ మేరకు బ్లూప్రింట్‌ను సిద్ధం చేస్తున్నట్లు శరత్ పట్నాయక్ వెల్లడించారు.

చోరీ సొత్తుతో నిందితుడి అరెస్ట్



నిందితుడు ధీరేన్ గొరడ

జయపురం: పట్టణంలోని డెప్పిగుడ ప్రాంతంలో ఈనెల 17న రాత్రి అపహరణకు గురైన వస్తువులతో పాటు నిందితుడిని అరెస్ట్ చేశామని పట్టణ పోలీసు అధికారి సంబిత్‌కుమార్ బెహర ఆదివారం వెల్లడించారు. డెప్పిగుడలో ఎ.లోకేష్‌కు చెందిన మెకానిక్ దుకాణంలో 3 బ్యాటరీలు, 10 సెల్ఫ్ మోటార్లు, 5 డైనమోలు దొంగిలించబడినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేయడంతో పాటు ఐఐసీ, ఎస్‌ఐలు నవీన్ చౌధురి, నవీన మడకాని, సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. పక్కా సమాచారం మేరకు డెప్పిగుడలో దాడి చేసి, నిందితుడు ధీరేన్ గొరడ(23)ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

రామమందిరం నిర్మాణానికి భూమిపూజ



మందిర నిర్మాణానికి మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తున్న తిరుపతి పాణిగ్రాహి

పర్లాకిమిడి: పట్టణంలోని ఒకటో నంబర్ వార్డు రాంనగర్‌లో రామమందిర నిర్మాణానికి భూమిపూజ ఆదివారం చేపట్టారు. హైటెక్ విద్యాసంస్థల చైర్మన్, బీజేడీ సీనియర్ నాయకులు తిరుపతి పాణిగ్రాహి హాజరై, శంకుస్థాపన పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మందిర నిర్మాణం ప్రణాళికను ఆవిష్కరిస్తూ రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఏడాది లోగా నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మహంత రామానంద దాస్, వీహెచ్‌పీ పట్టణ అధ్యక్షుడు కైలాష్‌చంద్ర గౌడొ, సత్యమహారాజ్, కార్యదర్శి హరిమోహన్ పట్నాయక్, అనాది పాణిగ్రాహి, మాజీ కౌన్సిలర్ కోట్ల పుణ్యవతి, బీజేపీ నాయకులు ఛిత్రి సింహాద్రి నాయుడు, బీజేడీ రాష్ట్ర కార్యదర్శి బసంత్ దాస్, మారుత్ పాలో తదితరులు పాల్గొన్నారు.



ధర్మ జెండా ఎగుర వేస్తున్న దృశ్యం

దోపిడీ ముఠా అరెస్ట్



కబిసూర్యనగర్‌లో పోలీసుల అదుపులో నిందితులు

బరంపురం: గంజాం జిల్లా కబిసూర్యనగర్ పట్టణంలో గత కొద్ది రోజులగా జరుగుతున్న దోపిడీలకు సంబంధించి ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి చోరీ సొత్తుతో పాటు మారణాయుధాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ జగ్‌మోహన్ మినా తెలిపారు. దోపిడీ ఘటనలపై నమోదైన కేసుల మేరకు ప్రత్యేక పోలీసు బృందాన్ని నియమించి దర్యాప్తు చేపట్టామన్నారు. ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.80 నగదు, కారు, బైక్‌తో పాటు 6 సెల్‌ఫోన్లు, మారణాయుధాలను సీజ్ చేశామని వెల్లడించారు. అలాగే ఈనెల 19న గంగపూర్ పరిధిలో కొండాయికల్లి జంక్షన్ సమీపంలోని అన్నపూర్ణ ఫైనాన్స్ కంపెనీ ఏజెంట్ నుంచి రూ.లక్ష దోచుకొని పరారైన నలుగురు నిందితులను కోదలా పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి బంగారం, వెండి ఆభరణాలతో పాటు చోరీ సొత్తును రికవరీ చేశారు.



దుండగుల నుంచి సీజ్ చేసిన చోరీ సొత్తుతో పోలీసులు

నెక్కంటికి ఘన సన్మానం

- వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించిన బీజేడీ శ్రేణులు



తమ అభిమాన నాయకుడిని గజమాలతో సత్కరిన్న బీజేడీ శ్రేణులు

రాయగడ: బీజేడీ రాష్ట్రశాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు పుట్టిన రోజు వేడుకలు పట్టణంలోని రాణిగుడ ఫారంలో ఉన్న ఆయన నివాసంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు, వివిధ సంఘాల ప్రతినిధులు ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు. గజమాలతో ఆయనను ఘనంగా సత్కరించారు. ముందుగా కస్తూరీనగర్ లోని శక్తి వృద్ధాశ్రమానికి వెళ్లిన నెక్కంటి.. వారికి చీరలు, బట్టలు పంపిణీ చేసి, ఆశీర్వాదం తీసుకున్నారు. శరణాలయంలో చిన్నారులను కలుసుకొని, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శ్రద్ధగా చదువుకుని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠ్య పుస్తకాలు, పెన్సిల్లు, పెన్నులు, ఇతర సామగ్రి పంపిణీ చేశారు. అలాగే బీజేడీ రాష్ట్రశాఖ ఉపాధ్యక్షుడిగా నియమితులైన నెక్కంటిని ఈ సందర్భంగా అభినందించేందుకు జిల్లాకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్, రాయగడ మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్, గుణుపూర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శివగౌడొ, మాజీమంత్రి లాల్‌బిహరి హిమిరిక, ఎస్‌డీసీ చైర్‌పర్సన్ అనసూయ మాఝి తదితరులు ఆయనను అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

270యూనిట్ల రక్తం సేకరణ

నెక్కంటి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో బీజేడీ శ్రేణులు నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. 270మంది యువతీ, యువకులు స్వచ్ఛందంగా పాల్గొని, రక్తదానం చేశారు. శిబిరాన్ని ప్రారంభించిన నెక్కంటి.. సేవా దృక్పథంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అలాగే ఆయన సతీమణి చాముండేశ్వరి దేవి సైతం రక్తదానం చేసి, ఆదర్శంగా నిలిచారు.



వృద్ధాశ్రమంలో మహిళల ఆశీర్వాదం తీసుకుంటున్న నెక్కంటి భాస్కరరావు



రక్తదానం చేస్తున్న తన భార్య చాముండేశ్వరి దేవిని అభినందిస్తున్న నెక్కంటి

శీఘ్ర దర్శనానికి అనుమతించాలి

- సైకతశిల్పి సుదర్శన్ పట్నాయక్ డిమాండ్
- శ్రీమందిరం ఆవరణలో నిరసనకు సన్నద్ధం

భువనేశ్వర్: ప్రాచీన 12వ శతాబ్దపు పూరీ జగన్నాథ ఆలయం(శ్రీ మందిరం)లో కనీసం ఒక ద్వారమైనా స్థానిక నివాసితుల కోసం తెరవాలని ప్రముఖ సైకత శిల్పి, జగన్నాథ ఆలయ పాలకమండలి(ఎస్‌జేటీఎంసీ) సభ్యుడు సుదర్శన్ పట్నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కనీసం ఒక్క ద్వారం తెరవకపోతే సోమవారం ఉదయం నుంచి మహాప్రభు జగన్నాథుడిని ప్రార్థించేందుకు పశ్చిమ ద్వారం ముందు బైఠాయిస్తానని హెచ్చరించారు. ప్రస్తుతం భక్తులు సింహద్వారం మీదుగా మాత్రమే ఆలయంలోకి ప్రవేశిస్తున్నారు. ఈ పరిస్థితి అవాంఛనీయ రద్దీ ప్రేరేపిస్తోంది. స్వామి దర్శనం కోసం గంటల తరబడి భక్తులు, యాత్రికులు బారులు తీరాల్సి వస్తుంది. ఈ పరిస్థితి నుంచి స్థానికులకు వెసులుబాటు కల్పించేందుకు మిగిలిన 3 ద్వారాల్లో కనీసం మరోద్వారం తెరవాలని ఆయన కోరారు. స్థానికుల భావోద్వేగాలను గౌరవించేందుకు పాలక మండలి తాత్కాలికంగా స్పందించాలన్నారు. ఛత్తీసా నియోగుల ప్రముఖులతో ఏర్పాటైన సబ్‌కమిటీ విచారణ మేరకు మిగిలిన ద్వారాలు తెరిచే విషయంలో తుది నిర్ణయం తీసుకోవచ్చని సలహా ఇచ్చారు. కోవిడ్-19 మహమ్మారి ప్రభావం పురస్కరించుకుని భక్తుల కోసం జగన్నాథ దేవాలయం సింహద్వారం మినహా మిగిలిన మూడు ద్వారాల తలుపులు మూసివేశారు. ప్రస్తుతం పరిస్థితి సద్దుమణిగినా, ద్వారాల మూసివేతపై ఆంక్షలు తొలగక పోవడం పట్ల సుదర్శన్ వ్యక్తం చేశారు. కనీసం స్థానిక ప్రజల సౌకర్యానికి వీలుగా కనీసం మరోద్వారం తలుపు తెరిచి దర్శనానికి వెళ్లేందుకు అనుమతించాలని అభిప్రాయం వ్యక్తంచేశారు.



సుదర్శన్ పట్నాయక్



పూరీ ఆలయం

క్లుప్తంగా

పక్కాగా ఎస్‌బీఐ సేవలు

● జోనల్ చీఫ్ మేనేజర్ వేణుగోపాల్



అరికతోట వినియోగదారుల సేవా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్‌బీఐ జోనల్ చీఫ్ మేనేజర్

రామభద్రపురం: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖాతాదారుల సేవా కేంద్రాల్లో సేవలు పక్కాగా నిర్వహించి వినియోగదారులకు పక్కాగా సేవలు అందించాలని విశాఖ జోనల్ చీఫ్ మేనేజర్ వేణుగోపాల్ సూచించారు. బొబ్బిలి ఆర్బీ వో పరిధిలోని పలు ఖాతాదారుల సేవా కేంద్రాల్లో ఆదివారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించా రు. మండలంలోని అరికతోట, రామభద్రపురం, గొల్లపేటలో గల సేవా కేంద్రాలను తనిఖీలు చేసి నిర్వాహకులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ఖాతాదారులకు సత్వర వినియోగానికి ఈ కేంద్రాలను బ్యాంక్ కల్పించిందన్నారు. ఈ కేంద్రాలను ఖాతాదారులు సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. అందరి ఖాతాదారులకు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా, సురక్ష బీమా, అటల్ పెన్షన్ యోజన పథకాలు వర్తించేలా అవగాహన కల్పించాలని అన్నారు. ఈ పథకంలో సహజ మర ణం పొందితే రూ.రెండు లక్షలు, ప్రమాదవశాత్తు మర ణిస్తే రూ.4 లక్షలు వర్తిస్తాయని తెలిపారు. ఈ పథకాలు అన్ని కేంద్రాలలో ప్రదర్శించాలని ఆదేశించారు. ఆయన వెంట జెడ్‌ఎంపీ జిల్లా కో ఆర్డినేటర్ మూడడ్ల వెంకటరావు, కేంద్రాల నిర్వాహకులు సీఎస్పీ పీవీ సత్యారావు, అరుణశ్రీ ఉన్నారు.

కుక్కల దాడిలో 11 మూగజీవాల మృతి



కుక్కల దాడిలో మరణించిన మేక, గొర్రె పిల్లలు

పాలకొండ రూరల్: పట్టణంలోని యాలాం కూడలిలో శనగల దుర్గారావుకు చెందిన 11 మేక, గొర్రె పిల్లలు వీధి కుక్కల దాడిలో ఆదివారం మరణించాయి. మేకల దొడ్డిలో కుక్కలు చొరబడి తీవ్రంగా గాయపరచడంతో మృత్యువాత పడ్డాయని బాధిత రైతు కన్నీటిపర్యంతమయ్యాడు. మేకల పెంపకంపై ఆధారపడి జీవనం గడుపుతున్నామని, వాటి మరణంతో రూ.50 వేలకు పైబడి నష్టం వాటిల్లినట్లు వాపోయాడు. అధికారులు తన కష్టం గుర్తించాలని రోదించాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



పార్వతీపురం/సీతానగరం: పార్వతీపురం మండలం నడిమి ములగ గ్రామానికి చెందిన మడక ఉదయ్ కుమార్ స్నేహితుడు సురాపాటి చంటితో కలిసి మోటార్ సైకిల్‌పై బొబ్బిలి వెళ్తుండగా, ప్రమాదానికి గురి కావడంతో ఇద్దరూ ఆదివారం ఉదయం తీవ్ర గాయాల పాలయ్యారు. మార్గమధ్యంలో తాన్న సీతారాంపురం కూడలి వద్దకు వారి బైక్ వచ్చే సరికి సీతానగరం నుంచి పార్వతీపురం వస్తున్న కారు బలంగా ఢీకొనడంతో మోటార్ సైకిల్‌పై నుంచి తుళ్లి రోడ్డుపై పడ్డారు. ఈ ప్రమాదంలో ఉదయ్‌కుమార్, చంటి గాయాల పాలవడంతో గమనించిన స్థానికులు 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

రాజాం సిటీ: పట్టణ పరిధి మెంటిపేట ఎస్సీ కాలనీకి చెందిన యువతి అదృశ్యంపై కేసు నమోదుచేశామని సీఐ కె.రవికుమార్ ఆదివారం తెలిపారు. ఈ నెల 22 సాయంత్రం ఎవరూలేని సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయిందని తల్లి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. వేరే అబ్బాయిని ప్రేమిస్తున్నానని అతనితో వెళ్లిపోతున్నానని, నాకోసం వెతకవద్దని లెటర్‌రాసి వెళ్లిపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

25న నియోజకవర్గ స్థాయి సమావేశం

పార్వతీపురం: పార్వతీపురం, సాలూరు నియోజకవర్గ స్థాయి సమావేశాలను ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 25న ఉదయం 10 గంటలకు పార్వతీపురం కలెక్టర్ కార్యాలయంలో సాలూరు నియోజకవర్గ స్థాయి సమావేశం, మధ్యాహ్నం 2 గంటలకు పార్వతీపురం నియోజకవర్గ స్థాయి సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర పరిశ్రమలశాఖామంత్రి గుడివాడ అమర్నాథ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. అలాగే ఆగస్టు 1న కురుపాం నియోజకవర్గ స్థాయి సమావేశం, ఆగస్టు 8న పాలకొండ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించేందుకు ప్రతిపాదించినట్లు వివరించారు.

ఉత్సాహంగా వన మహోత్సవాలు

● మొక్కలు నాటిన అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు



పాత్రొపుట్ వద్ద మొక్కలు నాటుతున్న సహాజ్య సభ్యులు

జయపురం: పట్టణంలోని వివిధ స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు, విద్యార్థులు, అధికారులు ఆదివారం వన మహోత్సవం చేపట్టారు. మొక్కలు నాటి, పర్యావరణ ప్రాధాన్యతను చాటిచెప్పారు. జయపురం అసోషియన్ ఎన్విరాన్‌మెంటల్, ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్(సీవా) ఆధ్వర్యంలో గగణాపూర్‌లో మొక్కలు నాటారు. జి.వెంకటరెడ్డి, బినాయక మహాపాత్రొ, సభ్యులు గ్రామస్తులకు 100మొక్కలు పంపిణీ చేశారు. అంతేకాకుండా నాటిన మొక్కలు పెరిగేంత వరకు వాటిని పరిరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో సీవా సభ్యులు విష్ణుజిత్ మిశ్రా, సౌమ్యరంజన్ దొళాయ్, గోపాల సాహు, ప్రతాప్ పట్నాయక్, కృష్ణచంద్ర దాస్, రవీంద్రనాథ్ సాహు, కె.కృష్ణారావు, కె.మోహనరావు, పి.విశ్వనాథ్, పి.శివ తదితరులు పాల్గొన్నారు. సహాజ్య హెల్పింగ్ హ్యాండ్స్, జయపురం అటవీ విభాగం సంయుక్తంగా పాత్రొపుట్ వంతెన ప్రాంతంలో 150 మొక్కలు నాటారు. వంతెన పరిసరాల్లోని అటవీ ప్రాంతంలో నివసించే వానరాలు సరైన ఆహారం లభించక రోడ్డుపైకి వచ్చి ప్రయాణీకులు అందించే ఆహార పదార్థాలపై ఆధార పడుతున్నాయని అటవీ విభాగం అధికారి బిక్రమ్ పాడార్ తెలిపారు. ఈ నేపథ్యంలో మామిడి, పనస, జామి, నేరేడు, నిమ్మ తదితర పండ్ల మొక్కలు నాటామన్నారు. కార్యక్రమంలో సభ్యులు పవిత్ర పాత్రొ, కార్తీక రౌళొ, సత్య త్రిపాఠి, జయంతా శాంత, రామ పాణిగ్రహి, బి.రమేష్‌రావు, స్వప్న సాహు, జయంతి దాస్, శ్రీకాంత దాస్, జయంతి నాయక్, బాపి పొరిడ, అరుణకుమార్ జెనా, గిరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ శిశు విద్యాలయం

పట్టణంలోని అరవింద నగర్ సరస్వతీ శిశు విద్యా మందిరం విద్యార్థులు, అధ్యాపకులు వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పాఠశాల ప్రాంగణం, ఎక్తాగుడ, కళాశాల కూడలి, దుబులి జంక్షన్, బంగ్లాబెడ కూడలి, పల్లిగుడ పాఠశాలలో ఔషధ మొక్కలు నాటారు. కార్యక్రమాన్ని గురుమా సుమిత్ర పాఢి, ఎస్.సబిత, సుమిత్ర పండా, విద్యాలయ పరిచాలన కమిటీ అధ్యక్షుడు ప్రేమానంద నాయక్, న్యాయవాది గిరిధర ఖొర, తపన మహాపాత్ర, విద్యాలయ ప్రధాన గురువు లక్ష్మీకాంత మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

వనయజ్ఞంలో ఎంపీ, ఎమ్మెల్యే..

కొరాపుట్: నవరంగ్‌పూర్ జిల్లా జొరిగాం సమితిలోని సహజసిద్ధ జలపాతం చందనధార వద్ద ఎంపీ రమేష్‌చంద్ర మాఝి, అతని సోదరుడు, జొరిగాం ఎమ్మెల్యే ప్రకాష్‌చంద్ర మాఝి మొక్కలు నాటారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ చందనధార ప్రముఖ పర్యాటక కేంద్రంగా రూపు దిద్దుకుంటుందన్నారు. రూ.50 లక్షల నిధులతో ఒడిశా టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పర్యటకుల షెడ్, విద్యుత్, మెట్ల నిర్మాణం చేశారన్నారు. అలాగే సమితి నిధులు రూ.50 లక్షలతో భారీ కల్యాణ మండపం నిర్మాణం శరవేగంగా జరుగుతోందన్నారు. ఇరువురి సోదరుల కోటా నుంచి నిధులతో గతంలో రోడ్ల నిర్మాణం చేపట్టామని, ఇటీవల 5టీ కార్యదర్శి కార్తికేయ పాండ్యన్ సైతం చందనధార మెగా టూరిజం ప్రాజెక్టు నిమిత్తం రూ.3.7 కోట్లు మంజూరు చేశారని గుర్తుచేశారు. ఈ నిధులతో పర్యాటక భవనాలు, మార్కెట్, శివమందిరం నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు.



చందనధార జలపాతం వద్ద ఎంపీ రమేష్, ఎమ్మెల్యే ప్రకాష్



గగనాపూర్‌లో సీవా సభ్యులు అధ్వర్యంలో వన మహోత్సవం

ఘనంగా బీఎంఎస్ వ్యవస్థాపక దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న బీఎంఎస్ సభ్యులు

రాయగడ: పట్టణంలోని అశోక్ కల్యాణ మండపంలో భారతీయ మజ్దూర్ సంఘ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని సంస్థ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సామాజిక కార్యకర్త, సీనియర్ పాత్రికేయులు బాదల్‌కుమార్ ఝా, బీఎంఎస్ రాష్ట్ర శాఖ కార్యదర్శి జోగేశ్వర్ దాస్ అతిథులుగా హాజరయ్యారు. ముందుగా లోకమాన్య బాలగంగాధర్ తిలక్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఝా మాట్లాడుతూ దేశంలో కార్మిక వ్యవస్థను రూపుమాపాలన్నారు. కార్మికులకు సరైన న్యాయం జరిగేలా చట్టం అమలు చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రామికుల సంక్షేమం కోసం కృషి చేసి.. వారి ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్మికులకు బీమా పథకాలు, పింఛన్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో దుర్గామాధవ్ ఘోష్, ధర్మసింగ్ నాగ్, నేహా సింగ్, మమతా బిశ్వాల్, నిరంజన్ సేనాపతి, ఎ.తిరుపతిరావు, కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

కొఠియాలో అరవింద పాఢి పర్యటన



కొఠియాలో పర్యటిస్తున్న అరవింద పాఢి, కలెక్టర్ అక్తార్

కొరాపుట్: ఆంధ్రా–ఒడిశా వివాదాస్పద ప్రాంతం కొఠియాలో రాష్ట్ర వ్యవసాయ, రైతు నైపుణ్యాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి, ఉద్యానవన శాఖ డైరెక్టర్ డాక్టర్ అరవిందకుమార్ పాఢి ఆదివారం పర్యటించారు. కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కొఠియా గ్రామ పంచాయతీలో వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. బంగాళా దుంపలు పండిస్తున్న రైతులతో పొలాల వద్ద సమావేశమయ్యారు. పసుపు పంట, అల్లం తదితర పంటలు పండిస్తున్న వారి వద్దకు వెళ్లి వ్యవసాయ బీమా వినియోగించు కోవాలని సూచించారు. కొఠియాలో రైతుల సౌలభ్యం కోసం మరిన్ని సోలార్ కోల్డ్ రూమ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. పర్యటనలో జిల్లా కలెక్టర్ అబ్దుల్ మహ్మద్ అక్తార్, జిల్లా పరిషత్ సభ్యురాలు టొకై గెమల్, వ్యవసాయ, ఉద్యానవన, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అండర్-17 బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్ –17 బాల, బాలికల బాడ్మింటన్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 23 నుంచి నెల్లూరు జిల్లాలో రెండు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో జిల్లా నుంచి 6 గురు క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించనుండగా..బాలుర విభాగంలో ఎం.రోహిత్, ఏవీ.భరద్వాజ్, కె. రేవంత్, బాలికల విభాగంలో వై.జాహ్నవి, వై.రేణుశ్రీ, కె.ప్రజ్ఞానాయుడులు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు అంతర్ జిల్లాల బాల, బాలికల పోటీల్లో సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీ పడనున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరైన జట్టుకు పర్యవేక్షకులుగా జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ వీఎస్‌ప్రసాద్, ప్రధాన కార్యదర్శి వై.కుసుం బచ్చన్ వ్యవహరించనున్నారు.

భగవద్గీత పఠనం.. మోక్ష ప్రదాయం..

రేగిడి: భగవద్గీత పఠనం మోక్ష ప్రదాయమని పాలకొండకు చెందిన సత్యసాయి భక్తుడు, ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ తెలిపారు. ఆదివారం మండలంలోని దేవుదల గీతా మందిరంలో గొర్లె దామోదరరావు ఆధ్వర్యంలో జరిగిన దివ్య జీవన సత్సంగ సమావేశంలో పాల్గొన్న ఆయన భగవద్గీతను పఠిస్తే చెడు గీతలు చెరిగిపోతాయన్నారు. సమాజంలోని ప్రతిఒక్కరూ తమ తమ పనుల్లో బిజీగా ఉండడం వల్ల మానసిక ప్రశాంతతను కోల్పోతున్నారన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా మాత్రమే మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ కొంత సమయాన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేటాయించాలని సూచించారు. అనంత రం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మోహన్‌దాస్, అప్పలరాం, నిత్య స్మరణానందస్వామి, ఎం.సూర్యనారాయణ పాల్గొన్నారు.

వంగరలో గజరాజుల హల్‌చల్

వంగర: మండలంలోకి గజరాజులు శనివారం అర్ధరాత్రి సమయంలో ప్రవేశించాయి. ఎనిమిది గజరాజుల గుంపు మండల పరిధి కింజంగి, శ్రీహరిపురం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, శ్రీహరిపురం మీదుగా బాగెంపేట వద్దకు చేరు కొని ఎస్సీ కాలనీ సమీపంలో తిష్ట వేశాయి. ఆయా గ్రామాల్లో మొక్కజొన్న, వరి పంటలను ధ్వంసం చేశాయి. బాగెంపేటలో రైతు జొన్నాడ చంటికి చెందిన ధాన్యాన్ని ధ్వంసం చేశాయి. నిరుపేద రైతును ఆదుకోవాలని బాగెంపేట సర్పంచ్ రెడ్డి సత్యవతి అధికారులకు కోరారు. గజరాజుల ప్రవేశంతో అధికారులు అప్రమత్తమై గ్రామాల్లో దండోరా వేసి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

కేవీ విద్యార్థినికి డిప్యూటీ స్పీకర్ అభినందన



విశ్వకృపను అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఏపీ, తెలంగాణ కేంద్రీయ విద్యాలయ సంఘటన్ రీజినల్ క్రీడా పోటీల్లో విజయనగరానికి చెందిన కేంద్రియ విద్యాలయం విద్యార్థిని సత్తా చాటింది. అండర్–17 విభాగంలో 9వ తరగతి చదువుతున్న పి.విశ్వకృప డిస్క్ త్రో లో బంగారం, రిలేలో కాంస్య పతకాలు సాధించింది. ఈ సందర్భంగా ఆదివారం ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామిని ఆయన నివాసం వద్ద ఆమె మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ నేపథ్యంలో ఆమె సాధించిన విజయాలను అడిగి తెలుసుకున్న కోలగట్ల..ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ, మరిన్ని పతకాలు సాధించి ఈ ప్రాంతానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

అప్పల బాధతో ఆత్మహత్య

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని శేరీపేట గ్రామానికి చెందిన అంబళ్ల శ్రీను(25) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఎల్.దామోదరరావు తెలిపారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. శ్రీను సుమారు రూ.20లక్షల వరకు అప్పుల బారిన పడి మద్యం వ్యసనానికి బానిసయ్యాడని, ఈ క్రమంలో కుటుంబ కలహాలు కూడా ఏర్పడ్డాయని తెలిపారు. అప్పుల బాధ తాళలేక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నట్లు చెప్పారు. శ్రీనుకు మూడేళ్ల క్రితం వివాహం కాగా భార్య లక్ష్మి, రెండేళ్ల బాలుడు ఉన్నారు.

పురుగు మందు తాగి..

శృంగవరపుకోట: మండలంలో ధర్మవరం గ్రామానికి చెందిన గొర్లె సన్యాసి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్.కోట ఎస్సై తారకేశ్వరరావు చెప్పారు. గ్రామానికి చెందిన సన్యాసి (48) మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో ఈనెల 21వ తేదీ మధ్యాహ్నం 3గంటల సమయంలో మద్యం తాగేందుకు వెళ్లే ప్రయత్నం చేయగా, భార్య గౌరి మందు వారించడంతో, మనస్తాపం చెంది గడ్డిమందు తాగాడు. దీంతో ఆస్పత్రికి తరలించి వైద్యం చేస్తుండగా ఆదివారం ఉదయం మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గడ్డిమందు తాగి తీవ్రఅస్వస్థత



బాడంగి సీహెచ్‌సీలో చికిత్సపొందుతున్న బాధితుడు గంగరాజు

బాడంగి: మండలంలోని ముగడగ్రామానికి చెందిన గిరిడి బిల్లి గంగరాజు(35) గడ్డిమందు తాగి తీవ్రఅస్వస్థతకు గురయ్యాడు. భార్య, బంధువులు స్థానిక ఆస్పత్రికి చికిత్స నిమిత్తం 108 వాహనంలో తీసుకురాగా డాక్టర్ నాగేశ్వరరావు ప్రథమ చికిత్సచేసి మందుకక్కించే చర్యలు తీసుకున్నప్పటికీ పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు రిఫర్‌చేశారు. బాధితుడిది ముగడ గ్రామంకాగా మండలంలోని గొల్లాది గ్రామంలో గల అత్తవారింటికి వారాలపండుగకు వెళ్లి మద్యం తాగిన మీదట గడ్డిమందు తాగడంతో పరిస్థితి విషమంగా మారిందని డాక్టర్ చెప్పారు.

3తులాల బంగారం చోరీ



బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్సై ప్రశాంత్‌కుమార్

బలిజిపేట: మండలంలోని మురగడాంలో రెండు నివాసగృహాలలో మూడు తులాల బంగారం చోరీకి గురైంది. దీనిపై బాధిత కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బలిజిపేట ఎస్సై ప్రశాంత్‌కుమార్ దర్యాప్తు నిర్వహించారు. కాగాన లక్ష్మమ్మకు చెందిన 2తులాల బంగారం, బాత సింహాచలానికి చెందిన ఒక తులం బంగారం పోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పొలంపని నిమిత్తం ఇంటికి తాళాలు వేసి ప్రతిరోజూ పనికి వెళ్లిపోతూ ఇంట్లో ఉన్న బంగారం వస్తువులను వారు పట్టించుకోలేదు. ఆదివారం ఇళ్లలో చూసుకోగా బంగారం పోయినట్లు గుర్తించి లబోదిబోమన్నారు.

విద్యుత్ వైర్ల చోరీపై ఫిర్యాదు

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామంలో గల జగనన్న లేఅవుట్‌లో విద్యుత్ స్తంభాలకు వేసిన సిల్వర్ వైర్లు చోరీకి గురైనట్లు బొండపల్లి ఏఈఈ ఆర్.శంకర్రావు స్థానిక ఎస్సై ఎస్.రవికి ఆదివారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో గల లేఅవుట్‌లో విద్యుత్ స్తంభాలకు వేసిన రూ.లక్షాయాభైవేల విలువ చేసే విద్యుత్ వైర్లు కట్ చేసి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు గ్రామ సర్పంచ్ మండా ఆదిలక్ష్మి గుర్తించి తమ దృష్టికి తీసుకువచ్చారని ఏఈఈ తెలిపారు. ఈ మేరకు లేఅవుట్‌ను పరిశీలించి వైర్లు అపహరణకు గురైనట్లు గుర్తించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మరణంలోనూ వీడని పేగు బంధం

● గుండె పోటుతో తల్లి మృతి
● తట్టుకోలేక ఆగిన కుమారుడి ఊపిరి
● రాజాంలో విషాదం



మృతి చెందిన తల్లీ కుమారుడు కురమమ్మ, అమర్ (ఫైల్)

రాజాం సిటీ: తల్లీ కొడుకుల పేగు బంధం విడిపోనిది. తల్లిపై ఆ కుమారుడి మమకారం చెప్పలేనిది. అందుకే తల్లి మరణవార్త తెలుసుకున్న కుమారుడి గుండె కూడా ఆగిపోయింది. ఆదివారం వేర్వేరు చోట్ల జరిగిన ఈ విషాద ఘటనల వివరాల్లోకి వెళ్తే...రాజాం పట్టణానికి చెందిన యందవ కురమమ్మ(50) శ్రీకాకుళం జిల్లా పలాస ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే ఆదివారం కూడా విధులకు హాజరైన ఆమెకు ఒక్కసారిగా గుండెలో నొప్పి రావడంతో బీపీ, షుగర్ లెవల్స్ ఒక్కసారిగా పడిపోయి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఆర్టీసీ అధికారులు తొలుత పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో టెక్కలి ఏరియా ఆస్పత్రికి వైద్యులు రిఫర్ చేశారు. అక్కడకు తరలించేందుకు సిద్ధపడుతున్న సమయంలో తీవ్రమైన గుండె పోటుకు గురై మృతి చెందినట్లు ఆర్టీసీ డిపో మేనేజరు ఆర్.సీతారామనాయుడు తెలిపారని స్థానికులు పేర్కొన్నారు. ఆమె మృతి చెందిన విషయం రాజాంలోని మెంటిపేట ఎస్సీ కాలనీలో ఉన్న బంధువులకు తెలియడంతో విషాదంలో మునిగిపోయారు.

తల్లి వెంటే తనయుడు

యందవ కురమమ్మకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్ద కుమారుడు యందవ అమర్ (24) ఏలూరులో ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ శిక్షణ పొందుతున్నాడు. తల్లి మరణవార్త తెలియగానే ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అప్రమత్తమైన స్థానికులు సపర్యలు చేసి ఆస్పత్రికి తరలించినప్పటికీ ఫలితం దక్కలేదు. ఈ వార్త రాజాంలోని బంధువులకు తెలియడంతో ఆయన మృతదేహం తీసుకువచ్చేందుకు అక్కడకు పయనమయ్యారని స్థానికులు తెలిపారు. తల్లి మరణవార్త తెలియగానే కుమారుడు కుప్పకూలిపోయి మృతి చెందడంతో తీవ్ర విషాదం నెలకొంది. వీరిద్దరి విడదీయరాని పేగు బంధం పలువురిని కంటతడి పెట్టించింది.

డ్రైవర్‌ను హత్య చేసి లారీ చోరీ

● అనుమానాస్పద మృతి కేసును ఛేదించిన పోలీసులు
● రిమాండ్‌కు ఐదుగురు నిందితుల తరలింపు



సమావేశంలో మాట్లాడుతున్న చీపురుపల్లి డీఎస్పీ చక్రవర్తి, చిత్రంలో నిందితులు

బొండపల్లి: ఈనెల 13 వతేదీన గొట్లాం గ్రామం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి, అనుమానాస్పద స్థితిలో రైల్వే పట్టాలపై మృతి చెంది పడి ఉన్నట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం విజయనగరంలోని సర్వజన కేంద్రాస్పత్రికి తరలించి అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి బొండపల్లి పోలీసులకు కేసును బదిలీ చేశారు.

అన్ని కోణాల్లో పూర్తిస్థాయిలో దర్యాప్తు

రైల్వే పోలీసులు బదలాయించిన అనుమానాస్పద మృతి కేసుకు సంబంధించి పోలీసులు అన్ని కోణాల్లో పూర్తి స్థాయిలో దర్యాప్తు నిర్వహించి అది హత్యగా నిర్ధారించారు. ఈ కేసుకు సంబంధించి చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్.చక్రవర్తి ఆదివారం బొండపల్లి పోలీస్ స్టేషన్‌లో వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్‌కు జగదీష్ యాదవ్ (50) ఈ నెల 13న ఒడిశాలోని రాయగడ నుంచి విశాఖపట్నానికి ఐరన్‌లోడుతో లారీ తీసుకువస్తుండగా ఒడిశాలోని రాయగడ పరిసర ప్రాంతాలకు చెందిన కేసులో ప్రధాన నిందితుడు హరి ఈశ్వర్రావుతో పాటు కొంతమంది ప్రయాణికుల ముసుగులో లారీ ఎక్కారు. లారీ మండలంలోని గొట్లాం బైపాస్ రోడ్డు వద్దకు చేరుకునే సరికి డ్రైవర్‌ను హత్య చేసి మృతదేహాన్ని రైలు పట్టాల మధ్యలోకి విసిరివేశారు. అక్కడి నుంచి లారీతో గొట్లాం బైపాస్ మార్గంలో తగరపువలస మీదుగా భోగాపురం చేరుకుని స్క్రాప్ వ్యాపారి బెవర సాయిబాబాకు లారీతో పాటు ఇనుము విక్రయించారు. జీపీఎస్ ద్వారా లారీ జాడ కనుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా లారీని, ఇనుము కొనుగోలు చేసిన బెవర సాయిబాబును అదుపులోకి తీసుకుని విచారణ చేయగా కేసు ముడి వీడింది. దీంతో కేసులో ప్రధాన నిందితుడు హరి ఈశ్వర్రావుతో పాటు సహకరించిన మీసాల జయరాం, మీసాల చంద్రశేఖర్, ఎ.ధనుంజరావులతో పాటు వ్యాపారి సాయిబాబును అదుపులోకి తీసుకున్నారు. చోరీకి గురైన లారీతో పాటు, నిందితులు వినియోగించిన ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ కేసులో మొత్తం ఏడుగురు నిందితులకు సంబంధం ఉండగా మిగిలిన ఇద్దరు నిందితుల కోసం గజపతినగరం సర్కిల్ పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. సమావేశంలో గజపతినగరం సీఐ ఎల్.అప్పలనాయుడు, బొండపల్లి ఎస్సై ఎస్.రవి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీ

క్లుప్తంగా

అర్ధరాత్రి లాడ్జీల్లో తనిఖీలు



లాడ్జిలో కస్టమర్‌ను ప్రశ్నిస్తున్న సీఐ శ్రీనివాసరావు

శ్రీకాకుళం క్రైమ్: అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే శక్తులకు ఎలాంటి పరిస్థితుల్లో వసతి కల్పించరాదని లాడ్జి యజమానులకు సీఐ పి.శ్రీనివాసరావు హితవు పలికారు. నగరంలోని రెండో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని లాడ్జిలను శనివారం అర్ధరాత్రి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా చేసేవారికి, జూదం ఆడేవారికి, ఇతర సంఘ విద్రోహ శక్తులకు వసతి కల్పించరాదని తెలిపారు. కస్టమర్ల ఆధార్ కార్డును క్షుణ్ణంగా పరిశీలించాక రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు.

రామమందిరం నమూనాతో..



రామమందిరం నమూనాతో వినాయకుడికి రంగులు అద్దుతున్న మహిళలు

కాశీబుగ్గ: అయోధ్యలో నిర్మితమవుతున్న రామ మందిరాన్ని గుర్తుకు తెస్తూ వినాయక విగ్రహాలు తయారవుతున్నాయి. పలాసలో ఆరుబయటే వీటిని తయారు చేస్తుండడంతో డిమాండ్ బాగా పెరుగుతోంది. పలాస, కాశీబుగ్గ, టెక్కలి, కోటబొమ్మాళి, ఇచ్ఛాపురంలలో ఇలాంటి విగ్రహాలు కనిపిస్తున్నాయి.

తల్లికి తలకొరివి పెట్టిన తనయ



అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఉమాదేవి

శ్రీకాకుళం రూరల్: మండలంలోని వాకలవలసలో శనివారం రాత్రి పైడి తవిటమ్మ (50) గుండెపోటుతో మృతిచెందింది. ఆమె భర్త పైడి రాజారావు కూలి పని కోసం తమిళనాడులోని కోయంబత్తూరులో నివాసం ఉంటున్నాడు. కుమారులు లేరు. దీంతో చిన్న కుమార్తె ఉమాదేవి తల్లి అంత్యక్రియలు పూర్తి చేసింది.

జిల్లాకు చేరిన ఈవీఎంలు



ఈవీఎం యంత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, డీఆర్వో మురళీకృష్ణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రానికి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎం)లు చేరుకున్నాయి. కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఈవీఎంల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక భవనంలో వీటిని భద్రపరిచారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులతో కలిసి భవనాన్ని పరిశీలించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఈవీఎంలు గోడౌన్ ఖరారు చేశారు. విశాఖపట్నం కలెక్టరేట్ నుంచి 1,440 బ్యాలెట్ యూనిట్లు (బి.యులు), 2,100 కంట్రోల్ యూనిట్లు (సి.యులు)వచ్చాయి. రెండు రోజుల్లో మరో ఏడువేల వీవీ ప్యాడ్లు వస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 2,342 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలను నియమించామని, బీఎల్‌ఓలు ఇంటింటికి తిరిగి ఓటరు నమోదు, తొలగింపు, మార్పులు చేర్పులు నిర్వహించనున్నట్లు తెలిపారు. పొలిటికల్ పార్టీలు కూడా బూత్ లెవెల్ ఏజెంట్స్‌ను ఏర్పాటు చేశారని, అందరూ సహకరించాలని తెలిపారు. ఈవీఎంల స్వీకరణ ప్రక్రియకు వివిధ పార్టీల ప్రతినిధులు రౌతు శంకరరావు (వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ), బొకర నారాయణ రావ్, (బిఎస్పి), పి.ఎం.జె బాబు (టిడిపి), ఇప్పిలి సీతారాజు (బి.జె. పి) తదితరులు హాజరయ్యారు.

ఆటో నుంచి జారిపడి వివాహిత మృతి

పొందూరు: మండలంలోని దళ్లవలస గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం రూరల్ మండలం పాత్రునివలస గ్రామానికి చెందిన పంచకర్ల నూకరత్నం(33) మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నూకరత్నం జి.సిగడాంలో ఉంటున్న బంధువుల పరామర్శకు వెళ్లి తిరిగి ఆటోలో స్వగ్రామానికి బయలుదేరింది. పొందూరు వైపు నుంచి రాపాక మీదుగా వస్తుండగా దళ్లవలస సమీపంలో నారాయణపురం కాలువ బ్రిడ్జిని దాటుతున్న సమయంలో ఆటో నుంచి జారిపడింది.

ఆరోగ్యమస్తు



టెక్కలిలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన ఆయన ... షేక్ అమీర్. నాలుగేళ్లుగా దీర్ఘకాలిక వ్యాధితో మంచాన ఉన్నారు. మందులు కొనుక్కోవడానికి కూడా డబ్బుల్లేని దీన స్థితి. ఫ్యామిలీ డాక్టర్ పుణ్యమా అని నెలకు రెండు సార్లు వైద్యులు, వారానికి రెండు సార్లు వైద్య సిబ్బంది ఆయన ఇంటికే వెళ్లి చికిత్స అందిస్తున్నారు. మందులన్నీ పూర్తి ఉచితంగా ఇస్తున్నారు. ఇంత కంటే తనలాంటి పేదలకు కావాల్సింది ఏముంటుందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.




ఈమె పేరు బూరాడ అమ్మడమ్మ. జి.సిగడాం మండలంలోని వాండ్రంగి గ్రామం. ఎనిమిదేళ్లుగా ఈమె అనారోగ్యంతో బాధ పడుతున్నా ఊరి నుంచి బయటకు వెళ్లి చికిత్స చేయించుకోలేదు. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దయ వల్ల ఆమె ఇంటి వద్దకే వచ్చి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఎప్పటికప్పుడు పరీక్షలు చేసి ఆమెతో మాట్లాడి ధైర్యం చెబుతున్నారు. తమ ఊరి డాక్టర్లు యశ్వంత్, హరితశ్రీలు దేవుళ్లలా తనకు సేవలు అందిస్తున్నారని, ఇలాంటి సదుపాయం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలని ఆమె చెబుతున్నారు.



ఈ పెద్దాయన పేరు బొబ్బిలి తమ్మయ్య. ఇచ్ఛాపురం మండలం కీర్తిపురం గ్రామానికి చెందినవారు. నాలుగు నెలల కిందటి వరకు పక్షవాతంతో పాటు షుగర్, బీపీ ఉండేవి. కార్పొరేట్ ఆస్పత్రుల్లో చూపించినా ఫలితం లేదు. ఆపై చికిత్స చేయించడం తలకు మించిన భారం కావడంతో వదిలేశారు. అదే సమయంలో ప్రభుత్వం ప్రారంభించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఆయన పాలిట ప్రాణదాతగా నిలిచింది. డాక్టర్ భేరి భార్గవి తమ్మయ్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రతి వారం చికిత్స చేస్తూ ఉచితంగా మందులు అందజేయడంతో ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారు.



ప్రభుత్వం దీర్ఘాయుష్మాన్ భవ అని దీవిస్తోంది. కష్టాల కొలిమిలో పడి సగానికి అరిగిపోయిన సామాన్యుడి ఆయుష్షు రేఖలకు కొత్త ఊపిరి అందిస్తోంది. నిరుపేద నుదుటిపై ముద్రించేసిన దురదృష్టపు రాతలను చెరిపేస్తోంది. ఇంటి అవసరాల కోసం మధ్య తరగతి మనిషి తాకట్టు పెట్టేసిన ఆరోగ్యాన్ని తిరిగి అందిస్తోంది. సగటు జీవిని బతుకంతా భయపెట్టిన ఓపీ రోదులు, గంటల కొద్దీ క్యూలు, లక్షల్లో ఫీజుల ఊసు లేని ఉచిత వైద్యాన్ని ఇంటి వద్దకు తెచ్చి ఇస్తోంది. సామాన్యుల కోసం వైఎస్ జగన్ సర్కారు ఫ్యామిలీ డాక్టర్ అనే వినూత్న విధానానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఈ కార్యక్రమం విజయవంతంగా అమలవుతూ వేలాది మంది ఆరోగ్యాలను బాగు చేస్తోంది.



- జిల్లాలో విజయవంతంగా 'ఫ్యామిలీ డాక్టర్' అమలు
- ఇంతవరకు 2.41 లక్షల ఓపీ కేసులు పూర్తి
- 594 వైఎస్సార్ విలేజి హెల్త్ క్లినిక్స్‌లో ఈ విధానం అమలు
- జిల్లాలో అందుబాటులో 142 మంది వైద్యులు
- 14 రకాల వైద్య పరీక్షలు, 105 రకాల మందులతో చికిత్స

అరసవల్లి: ఊరికి ఊపిరి వచ్చింది. ఇన్నాళ్లూ ఆస్పత్రులకు వెళ్లలేక ఇంటికే పరిమితమైన నిరుపేద వృద్ధులు, మధ్య వయస్కులకు ఉన్న వీధిలోనే మంచి వైద్యం అందుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూపొందించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ (ఎఫ్‌పీసీ) తీసుకువచ్చిన మార్పు ఇది. వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న వారికి మొబైల్ మెడికల్ యూనిట్ (104) వాహనా ల ద్వారా ఓపీ వైద్యాన్ని, ఉచితంగా పరీక్షలు, మందులు ఇచ్చే ప్రక్రియను కూడా ఇందులో భాగం చేశారు. మన జిల్లాలో గత ఏడాది అక్టోబర్ 21 నుంచి నేటి వరకు ఈ విధానం దిగ్విజయంగా కొనసాగుతోంది. ఈ పద్ధతి ద్వారా జిల్లా వ్యాప్తంగా 71 పీహెచ్‌సీల పరిధిలో ఈ ఉచిత సర్వీసులను 4,06,438 మంది వినియోగించుకోగా.. వీరిలో సాధారణ ఆరోగ్య ఓపీ చూపించుకున్నవారు 2,41,548 మంది వరకు ఉన్నారు.

క్షేత్ర స్థాయిలో ఇలా..

జిల్లాలోని 30 మండలాల్లో ఉన్న 71 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) పరిధిలోని 594 వైఎస్సార్ విలేజి హెల్త్ క్లినిక్స్ పరిధిలోని గ్రామాల్లో ఈ ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ అమలవుతోంది. పీహెచ్‌సీలో 14 మంది సిబ్బందితో ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉన్నారు. జిల్లాలో 51 మొబైల్ మెడికల్ యూనిట్..(104 వాహనాల) సేవలను ఈ ఎఫ్‌పీసీ విధానం అమల్లో భాగస్వామ్యం చేయడంతో ఓపీ సేవలకు మంచి రెస్పాన్స్ వస్తోంది.

- సగటున రోజుకు 50 నుంచి 60 వరకు రోగులు ఈ శిబిరాలకు హాజరవుతున్నారు.
- పీహెచ్‌సీ పరిధిలో సచివాలయం వద్దనే ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ చూస్తున్నారు.
- అక్కడే బీపీ, సుగర్ వంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నారు.
- భోజన విరామం అనంతరం సాయంత్రం 4 గంటల వరకు ఆయా పీహెచ్‌సీ వైద్యునితో పాటు ఆశ వర్కర్, ఏఎన్ఎం, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ బృందంగా ఇంటిలో మంచానికే పరిమితమైన రోగులను పరీక్షిస్తున్నారు.
- ఈ క్రమంలో మెరుగైన వైద్యం అవసరం ఉంటే రిఫర్ చేయడం.. ఇలా వారి ఆరోగ్యం బాగయ్యేంత వరకు ఫాలోఅప్ చేస్తున్నారు.
- ఇక 104 వాహనం ఓపీ వద్ద 12 రకాల వైద్య సేవలు, 14 రకాల వైద్య పరీక్షలతో పాటు 105 రకాల మందులు నెల రోజులకు సరిపడా ఉచితంగా అందించేందుకు అందుబాటులో ఉంచుతున్నారు.
- బీపీ, షుగర్‌తో పాటు క్యాన్సర్, హృద్రోగం, టీబీ తదితర పరీక్షలను కూడా నిర్వహించి, ఉచితంగా మందులు ఇస్తున్నారు. వ్యాధి తీవ్రతను బట్టి ఉన్నత వైద్యానికి రిఫర్ చేయనున్నారు.



నరసన్నపేట హడ్కో కాలనీలో ఇంటి వద్దే రోగిని పరీక్షిస్తున్న వైద్యురాలు



జి.సిగడాం మండలం చీడిపేటలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా సేవలు పొందిన వారి వివరాలు..

మొత్తం సందర్శించిన వారి సంఖ్య	4,06,438
సాధారణ ఆరోగ్య ఓపీ పరీక్షలు, మందులు పొందిన వారు	2,41,548
కౌమార బాలికలకు పరీక్షలు	589
యాంటీనేటల్ కేర్ పరీక్షలు	22316
బాలింతలకు ఆరోగ్య పరీక్షలు (పిఎన్‌సి)	12388
రక్తహీనత పరీక్షలు (ఎనీమియా)	1505
రక్తపోటు (బీపీ)	55045
మధుమేహం (షుగర్)	30121
బీపీ, షుగర్ రెండూ ఉన్న వారు	39953
నోటి క్యాన్సర్	647
రొమ్ము క్యాన్సర్	410
గర్భాశయ క్యాన్సర్	716
టీబీ (క్షయ)	1200



అద్భుత ప్రోగ్రాం



ప్రజలకు నేరుగా సేవలందించేందుకు దేశ చరిత్రలోనే మన రాష్ట్రంలో తొలిసారిగా అమలు చేసిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ (ఎఫ్‌పీసీ) విధానం అద్భుతమైన ప్రోగ్రాం. వైద్యవృత్తిని ఎంచుకున్న వారికి అద్భుత సేవామార్గం. ఆన్‌లైన్ చేయడంతో ఎక్కడ ఏ సేవలందిస్తున్నారో.. ఎవరికి మందులు ఎన్ని ఇస్తున్నారో కూడా పూర్తి వివరాలు తెలుస్తున్నాయి. జిల్లాలో 71 పీహెచ్‌సీల్లో 142 మంది వైద్యులు ఈ సేవలకు అందుబాటులో ఉన్నారు. స్థానిక రోగులకు ఉచిత పరీక్షలు, ఉచిత మందులు ఇవ్వడంతో పాటు ఇంటికే పరిమితమైన రోగుల పరిస్థితులను ఫాలోఅప్ చేయడమే ప్రధాన లక్ష్యం. అయితే ప్రతి సేవపై పర్యవేక్షణ ఉంటుంది. **– డాక్టర్ లక్ష్మీ తులసి, ఎఫ్‌పీసీ నోడల్ ఆఫీసర్**

బీపీ అదుపులోకి వచ్చింది



నాకు బీపీ వచ్చింది. ఇంట్లో వారిని వెంట పెట్టుకుని పెద్ద ఆస్పత్రులకు పరీక్షలకు వెళ్లి మందులు తెచ్చుకునేదాన్ని. ఇప్పుడు వీధిలోకి మా డాక్టర్ హరితమ్మ వస్తున్నారు. పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చారు. జాగ్రత్తలు చెప్పారు. ఇప్పుడు బీపీ అదుపులోకి వచ్చింది. డాక్టర్లు ఇంటికి రావడం.. మాతో మాట్లాడటం..మందులివ్వడం.. వంటివి ముందెప్పుడూ చూడలేదు. వినలేదు. **– సింహాద్రి రమణమ్మ, జి.సిగడాం**

మనోధైర్యం ఇస్తున్నారు



నేను, నా భార్య ఇద్దరం కొంతకాలంగా ఇంటికే పరిమితమయ్యాం. బీపీ షుగర్‌లతో పాటు ఇతరత్రా ఇబ్బందులుండేవి. వైద్యం కోసం సోంపేట, పలాస, బరంపురం కూడా వెళ్లేవాళ్లం. ధర ఎక్కువైనా మందులు తప్పనిసరిగా కొనుక్కునేవాళ్లం. అయితే ఇప్పుడు ఫ్యామిలీ డాక్టర్‌గా మా ఇంటికి కూడా ప్రభుత్వ డాక్టర్లు వస్తున్నారు. మా ఆరోగ్య యోగక్షేమాలను అడిగి.. కాసేపు ఆప్యాయంగా మాట్లాడేవారు. ఉచితంగా వైద్య పరీక్షలు చేసి నెలకు సరిపడా ఉచితంగానే మందులు ఇచ్చారు. ఇదే మాకు ఎంతో మనోధైర్యాన్నిచ్చింది. ఇప్పుడు కాస్త ఆరోగ్యం మెరుగుపడింది. **– ఉప్పాడ చంద్రయ్య, పాతకొజ్జీరియా, కవిటి మండలం**

ప్రత్యామ్నాయ ఆదాయంపై ప్రత్యేక దృష్టి

టెక్కలి: ఆర్టీసీలో టికెట్ ఆదాయంతో పాటు ప్రత్యామ్నాయ ఆదాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు వెల్లడించారు. టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్, డిపోను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక డిపో మేనేజర్ ఎస్.శ్రీనివాసరావుతో పాటు డీఎస్పీ బాలచంద్రారెడ్డి తదితరులు ఎండీకి మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా ఓఎస్ 15 పథకం ద్వారా తక్కువ డిపాజిట్‌తో తాత్కాలిక కట్టడాలతో ఆర్టీసీ స్థలాలను అద్దెకు ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించామని ఎండీ పేర్కొన్నారు. అలాగే కొత్తగా 10 వేల బస్సులను నవీకరణ చేశామన్నారు. వీటితో పాటు 1500 సాధారణ బస్సులు, వెయ్యి ఎలక్ట్రికల్ బస్సులు రానున్నాయన్నారు. గతంలో ఆర్టీసీలో కారుణ్య నియామకాలు ద్వారా కేవలం ఆర్టీసీలోనే ఉద్యోగాలు ఇచ్చేవారని ప్రస్తుత ప్రభుత్వంలో ఇతర శాఖల్లో ఉద్యోగాలు ఇచ్చే విధంగా మార్పులు తీసుకువచ్చారని, ఇప్పటికే 884 పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించామని ఎండీ గుర్తు చేశారు. అలాగే ఒడిశా ప్రాంతంలో ఏపీ బస్సులు తిరిగే విధంగా ఆయా ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నామని పేర్కొన్నారు. గతం కంటే ఆర్టీసీ బస్సు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయన్నారు.



టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్ ను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న ఎండీ ద్వారకాతిరుమలరావు.

అక్టోబర్ 17 నుంచి కొత్తమ్మ తల్లి ఉత్సవాలు

కోటబొమ్మాళి: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి ఉత్సవాలు అక్టోబర్ 17 నుంచి 19వ తేదీ వరకూ మూడురోజులపాటు నిర్వహించడానికి దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని ఆలయ కమిటీ చైర్మన్ బోయిన మాధవి, ఆలయ ఈఓ వాచకచర్ల రాధాకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏటా మహాలయ అమావాస్య అనంతరం వచ్చే మంగళవారం నుంచి గురువారం వరకూ మూడు రోజులు పాటు శ్రీకొత్తమ్మతల్లి ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలతో పాటు ఒడిశా రాష్ట్రం నుంచి కూడా లక్షల సంఖ్యలో భక్తులు ఈ ఉత్సవాలకు వస్తుంటారు. గత ఏడాది 5 లక్షలకుపైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఏడాది భక్తుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఆ మేరకు భారీగా ఏర్పాట్లు చేసేందుకు ఆలయ కమిటీ ప్రణాళికలు రూపొందిస్తోంది. త్వరలో ఆలయ కమిటీ చైర్మన్ బోయిన మాధవి, వైస్ ఎంపీపీ బోయిన నాగేశ్వరరావు, స్థానిక సర్పంచ్ కాళ్ల సంజీవరావు ఆధ్వర్యంలో ముందస్తుగా సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని ఆలయ ఈఓ వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు.



కొత్తమ్మ తల్లి అమ్మవారు

వసతి భళా.. హాస్టళ్లకు కొత్త కళ

- వసతి గృహాల్లో ఆధునిక వసతులు
- మార్పు, నాడు-నేడుతో అభివృద్ధి

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సంక్షేమ వసతి గృహాలకు మంచి రోజులు వచ్చాయి. అప్పటివరకు సదుపాయాల లేమితో కునారిల్లిన హాస్టళ్లలో ఇప్పుడు నూతన వసతులు కనిపిస్తున్నాయి. చక్కటి మెనూ, ఆరోగ్యవంతమైన భోజనం, నెలవారీ కాస్మోటిక్ చార్జీలతో పాటు వసతి గృహాలు ఆహ్లాదకర వాతావరణంలోకి మారాయి. గడచిన రెండేళ్లలో మార్పు పథకంతో చాలా వసతి గృహాలకు కొత్త రూపు వచ్చింది. ఈ ఏడాది నాడు-నేడులో భాగంగా మరిన్ని హాస్టళ్లను బాగు చేశారు.

కనిపించేలా మార్పు..

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత తక్షణ కర్తవ్యంగా సంక్షేమ వసతి గృహాలకు 'మార్పు' పేరిట నిధులు విడుదల చేసి, వసతుల కల్పనకు ప్రాధాన్యత కల్పించారు.
- ఈ పథకంలో భాగంగా సుమారుగా రూ.5 కోట్లకుపైగా ఖర్చు చేశారు.
- వసతి గృహాల్లో తక్షణ వసతుల కింద మరుగుదొడ్ల మరమ్మతులు, వాటికి సిరామిక్ పలకల ఏర్పాటు, లైటింగ్, ఫ్లోరింగ్, రన్నింగ్ వాటర్ సదుపాయం, ఆధునిక స్థాయిలో స్నానాల గదులు తీర్చిదిద్దడం, పార్కింగ్, కాంపౌండ్ వాల్, రంగులు వేయడం వంటివి చేపట్టారు.
- జిల్లాలో బీసీ సంక్షేమం శాఖలో 81 వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో 63 వసతి గృహాలు ప్రీ మెట్రిక్ కాగా, 18 పోస్టు మెట్రిక్‌లో ఉన్నాయి. ఈ వసతి గృహాల్లో 52 ప్రభుత్వ భవనాలు ఉన్నాయి. మిగిలినవి ప్రైవేటు భవనాల్లో నడుస్తున్నాయి.
- ప్రభుత్వ భవనాల్లో మార్పు పథకం గత రెండేళ్లుగా అమలు చేశారు. వీటిలో భాగంగా 52 వసతి గృహాల్లో 35 వసతి గృహాలకు గాను రూ.3.20 కోట్లు ఖర్చుచేశారు.
- ఎస్సీలో సంక్షేమ శాఖ పరిధిలో 31 వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో 20 ప్రీ మెట్రిక్ వసతి గృహాలుకాగా, 11 పోస్టుమెట్రిక్ వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో మార్పు పథకంలో భాగంగా 21 వసతి గృహాలకు గాను రూ.1.90 కోట్ల వ్యయంతో ఆధునిక వసతులు సమకూర్చారు.

నాడు-నేడులో..

పాఠశాలల అభివృద్ధితోపాటు ప్రభుత్వ వసతి గృహాలకు వసతుల్లో సమూల మార్పులు తీసుకువచ్చి, ఇంటిని మరిపించే విధంగా తయారు చేశారు. ఇప్పటికే ఈ వసతి గృహాల్లో వసతుల పరిశీలన పూర్తయ్యింది. నాడు-నేడుతో అభివృద్ధికి కావాల్సిన నిధులు కూడా సిద్ధమయ్యాయి. ఈ విడతలో ప్రభుత్వ భవనాలు కలిగిన వసతి గృహాలను బాగు చేయనున్నారు. నాడు-నేడు పథకం కింద జిల్లాలో బీసీ సంక్షేమ పరిధిలో 53 వసతి గృహాల్లోనూ, ఎస్సీ సంక్షేమ పరిధిలో 31 వసతి గృహాల్లోనూ పనులు చేపట్టనున్నారు.



మార్పు పథకంలో సుందరంగా మారిన నరసన్నపేట సాంఘిక సంక్షేమ వసతి గృహం

మరింత మెరుగుపడతాయి

జిల్లాలో బీసీ సంక్షేమ వసతి గృహాలు మరింత మెరుగుపడతాయి. ప్రభుత్వం నాడు-నేడు పథకాన్ని వసతి గృహాలకు అనుసంధానం చేసింది. నిధుల కోసం కావాల్సిన మరమ్మతుల కోసం ప్రభుత్వానికి నివేదికలు అందజేశాం. ఇది సంక్షేమానికి మంచి పరిణామం. **– ఇ.అనురాధ, బీసీ సంక్షేమాధికారి**

రక్షించేందుకు వెళ్లి.. ప్రాణాలు కోల్పోయి..

- పొందూరులో విద్యుత్ వైరు తెగిపడి యువకుడి మృతి
- విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ

పొందూరు: ఎదురుగా ఉన్న వ్యక్తుల ప్రాణాలకు అపాయం ఉందని గమనించిన ఆ యువకుడు వారిని కాపాడేందుకు వెళ్లి మృత్యువాత పడిన విషాద ఘటన ఆదివారం పొందూరులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పొందూరుకు చెందిన రిక్షా కార్మికుడు గొర్లె రాము కుమారుడు గొర్లె వసంతకుమార్(27) ఎచ్చెర్లలో పీజీ పూర్తి చేశాడు. చదువుకుంటూనే డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో పొందూరు ప్రధాన రహదారిలో సిస్టం కళాశాల సమీపంలో వాటర్ సర్వీస్ సెంటర్ వద్ద ఉన్న వసంత్‌కుమార్ ఎదురుగా చికెన్ సెంటర్‌పైన 33బై11 కేవీ వైరు షార్ట్ సర్క్యూట్ జరుగుతున్న విషయాన్ని గమనించి కేకలు వేశాడు. చికెన్‌సెంటర్ వద్దకు పరుగున వెళ్లి అరుస్తుండగానే ఒక్కసారిగా వైరు యువకుడిపై పడింది. విద్యుత్ షాక్ కొట్టడంతో సుమారు 20 అడుగుల దూరంలో పంట పొలంలోకి తుళ్లిపడ్డాడు. వెంటనే స్థానికులు స్పందించి విద్యుత్ ఏఈకి సమాచారం ఇచ్చి పొందూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొనఊపిరితో ఉన్న యువకుడిని ఆసుపత్రి సిబ్బంది సీపీఆర్ చేసి బతికించేందుకు ప్రయత్నం చేశారు. అయినా ఫలితం లేకపోయింది. వసంత్ ఇకలేడని తెలిసి తల్లిదండ్రులు జయలక్ష్మి, రాము, సోదరుడు శివ సొమ్మసిల్లిపోయారు.

విద్యుత్‌శాఖ అధికారులపై ఆగ్రహం..

విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యమే వసంతకుమార్ మృతికి కారణమని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్థానికులు ఆరోపించారు. వైర్లు మరమ్మతులు చేయాలని ఏఈ దుర్గాప్రసాద్‌కు కొద్ది రోజుల కిందటే ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని చెబుతున్నారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసులు యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేశారు.



పొందూరు ప్రభుత్వ ఆసుపత్రిలో యువకుడి మృతదేహం



గొర్లె వసంత కుమార్(ఫైల్)

నేడు ఆదిత్యుని హుండీ కానుకల లెక్కింపు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు ప్రక్రియ సోమవారం ఉదయం 8 గంటల నుంచి అనివెట్టి మండపంలో నిర్వహిస్తున్నట్లు ఈవో వి.హరిసూర్య ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామపెద్దలు, రెవెన్యూ, పోలీస్, దేవదాయ శాఖ జిల్లా అధికారుల పర్యవేక్షణలో హుండీలను తెరిపించి, లెక్కింపు చేపడతామని పేర్కొన్నారు. భక్తులు కూడా పాల్గొనవచ్చునని తెలిపారు.